విదేశీ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

నయీంనగర్, మే 31 : సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా అమెరికా, ఆస్ట్రేలియా, యూకే, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజీలాండ్, సింగపూర్ దేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టరోల్ స్టడీస్ కోసం అర్హత గల రాష్ట్రంలోని అల్ప సంఖ్యాక వర్గాల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీల సంక్షేమాధికారి తెలిపారు. జనవరి 1నుంచి 30వ తేదీ వరకు (ప్రైవేట్ సీజన్) అడ్మిషన్ తీసుకున్న వారు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు, జత పత్రాలు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5లక్షల్లోపు ఉండాలని, ఎంపికైన ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్, ఆర్థికసాయం కింద రూ.20 లక్షలు రెండు విడుతల్లో చెల్లిస్తామని, విమాన ప్రయాణ చార్జీలు రూ.60వేల వరకు చెల్లించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వ్యాధుల నివారణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలి : డీఎంహెచ్‌వో అప్పయ్య

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

నయీంనగర్, మే 31 : వర్షాకాలంలో వ్యాధుల నివారణ కోసం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని డీఎంహెచ్‌వో అప్పయ్య అన్నారు. హనుమకొండలోని జిల్లా సమీక్ష మందిరంలో ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్త్‌సూపర్ వైజర్లు, మలేరియా నోడల్ పర్సన్స్, హెల్త్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. దోమలు, ఈగల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అడిషనల్ జిల్లా వైద్య అధికారి మదన్‌మోహన్‌రావు, నరేశ్ పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే ఉద్యమాలు

దామెర, మే 31 : బడుగు, బలహీన వర్గాల న్యాయమైన హక్కుల సాధన కోసం ఉద్యమాలు తప్పవని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. శనివారం తక్కళ్లపహాడ్‌లో బండారి చిరంజీవి స్మారక స్తూపాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి పాలకులు స్పష్టమైన విధానాలు అవలంబించకపోవడం వల్ల పేదరికం అలాగే ఉంటున్నదని తెలిపారు. పాలకులు అనుసరిస్తున్న విధానాలు పేదల కోసం ఉపయోగపడాలే తప్ప అగ్రవర్ణాలకు ఉపయోగపడేలా ఉండొద్దని చెప్పారు. ఏఐటీయూఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద రవి, పెద్దారపు రమేశ్, సారా కిషన్, వక్కల కిషన్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

నయీంనగర్, మే 31 : రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన అధ్యాపకులకు రావాల్సిన రెండో వార్షిక ఇంక్రిమెంట్ విషయంలో కుట్రలు చేస్తున్న కొంతమంది వ్యక్తులకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, సురేశ్ మాట్లాడారు. కొంతమంది వ్యక్తులు దురుద్దేశంతో కుట్రపూరితంగా వాట్సాప్ మెసేజ్‌లతో నూతన అధ్యాపకులకు రావాల్సిన రెండవ వార్షిక ఇంక్రిమెంట్ రాకుండా కుట్ర పన్నారన్నారు. ఈ వ్యక్తులే గతం నుంచీ రాజ్యాంగేతర శక్తులుగా, బినామీలుగా మారి ఇంటర్ విద్యను గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్నారన్నారు. ఆదివారం కూడా ఈ కార్యక్రమం చేపడుతామని తెలిపారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం

నయీంనగర్, మే 31 : ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి అనిశెట్టి వెంకటేశ్ కూతురు విశిష్ట కావేరి పుట్టినరోజు సందర్భంగా శనివారం తలసీమియా బాధితుల కోసం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరేంద్ర ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ విజయచందర్‌రెడ్డి హాజరై దీన్ని ప్రారంభించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. వేణుగోపాల్, సరిత, సిదాంత్, మదన్‌మోహన్, రాజు, సురేశ్, శివకుమార్ పాల్గొన్నారు.

'బడి బాట' పాట సీడీ ఆవిష్కరణ

సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

నయీంనగర్, మే 31 : హనుమకొండలోని పీఆర్టీయూ భవనంలో సీహెచ్ రాము రాసిన 'పిలుస్తుంది బడిబాట' పాట సీడీని వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ప్రభుత్వ బడులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, శ్రీహరి, రవీందర్, జయపాల్‌రెడ్డి, సతీశ్, రాఘవరెడ్డి, రఘు, సురేశ్, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, మే 31 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యాదవనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి 11గంటల వరకు కొత్తూర్ జెండా, చర్చి, మార్కెట్ వెనుక సైడ్, తోటబడి, తోటబడి వెనుక సైడ్, భగత్‌సింగ్ నగర్, గోపాల్‌రావు బిల్డింగ్, డబ్బాలు, హనుమాన్‌నగర్, ఏకశిల, యాదవనగర్, పాలజెండా, రెడ్డికాలనీ, బుద్ధానగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

అధిక ధరలకు విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

పరకాల : గూడెప్పాడ్‌లో ఫర్టిలైజర్స్ షాపును తనిఖీ చేస్తున్న ఏవో యాదగిరి, సీఐ సంతోష్

ఆత్మకూరు, మే 31 : ఫర్టిలైజర్స్ షాపు యాజమానులు రైతులకు విత్తనాలను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి యాదగిరి డీలర్లను హెచ్చరించారు. శనివారం ఆత్మకూరు, గూడెప్పాడ్ గ్రామాల్లోని ఫర్టిలైజర్స్ షాపులను ఏవో, సీఐ సంతోష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అధికృత డీలర్ వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు రసీదును పంట కాలం అయిపోయేంత వరకు భద్రపర్చుకోవాలన్నారు. డీలర్లు గడువు దాటిన విత్తనాలను అమ్మవద్దన్నారు. తనిఖీలో షాపు లైసెన్స్, పలు రికార్డులను పరిశీలించారు. స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని, స్టాకు రిజిస్టర్స్ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు..

భీమదేవరపల్లి : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హనుమకొండ ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. ముల్కనూరు పత్తి విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి విత్తనాలు, ఎరువుల స్టాక్‌తో పాటు రికార్డుల నిర్వహణను పరిశీలించి ఆయన మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు విడిగా వ్యాపారం చేయకూడదని సూచించారు. రసీదులపై షాపు యజమాని, రైతు సంతకం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి పద్మ, సంతోష్ పాల్గొన్నారు.

విత్తన షాపుల్లో అధికారుల తనిఖీలు

ధర్మసాగర్ / వేలేరు : ధర్మసాగర్, వేలేరు మండలాల్లోని ఎరువుల, విత్తనాల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ ఏడీఏ అధికారి రాజ్‌కుమార్, ధర్మసాగర్ సీఐ ప్రవీణ్ కుమార్, వేలేరు ఎస్సై సురేశ్, ఏవోలు రాజేశ్, సంతోష్ వేర్వేరుగా తనిఖీలు చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని దుకాణాయాజమానులకు ఆదేశించారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే సమాచారం అందించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- జూన్ 6వ తేదీ నాటికి ప్రారంభం కావాలి
- కలెక్టర్ ప్రావీణ్య

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

నయీంనగర్, మే 31 : జిల్లాలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులు మరింత వేగంగా చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్లు, లబ్ధిదారుల ఎంపిక, పొజిషన్ సర్టిఫికెట్లు, రెవెన్యూ సదస్సులు, రాజీవ్ యువ వికాసం, టూ బీ హెచ్‌కే ఇళ్ల తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం పథకంపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఇందిరమ్మ ఇళ్లు పథకానికి సంబంధించి గృహ నిర్మాణ శాఖ డీఈ సిద్ధార్థ నాయక్, ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతికి సంబంధించిన వివరాలను ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకంలో మొదటి దశలో రూ. 50 వేలు, రూ.లక్షలోపు రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను జూన్ 9వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మండల స్థాయిలో పూర్తి చేసిన తర్వాత ఆ జాబితాను సబ్సిడీ రుణాల మంజూరు కోసం జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి పైలట్ గ్రామాల్లో ప్రారంభమైన ఇళ్ల నిర్మాణాల పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు ఎమ్మెల్యేలు అందజేస్తారన్నారు. జూన్ 6వ తేదీ నాటికి ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావాలని, జూన్ 9వ తేదీ నాటికి 100శాతం ప్రారంభించాలన్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఎంపీడీవోలు బఫర్ లిస్టు సిద్ధం చేయాలన్నారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈలు సమన్వయంతో పని చేయాలన్నారు. జూన్ చివరి నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తవ్వాలని, జిల్లాలో పైలట్ మండలంగా ఎంపికైన నడికూడలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని పరకాల ఆర్డీవో నారాయణ, నడికూడ తహసీల్దార్ రవీందర్‌రెడ్డిని ఆదేశించారు. దరఖాస్తుల విచారణ ప్రక్రియను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, జూన్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చే దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని నియోజకవర్గాల్లోనూ నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు వైవీ గణేశ్, మేన శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో లోపాలు ఉండొద్దు

దామెర, మే 31 : మండలంలోని సింగరాజుపల్లిలోని మిషన్ భగీరథ 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎన్‌పీడీసీఎల్ నోడల్ అధికారి, ఎంఅండ్‌టీ, కన్‌స్ట్రక్షన్స్ డివిజనల్ ఇంజినీర్ శనివారం సందర్శించి విద్యుత్ పరికరాల పనితీరును తనిఖీ చేశారు. బ్రేకర్ పనిచేయక పోవడంతో వెంటనే దాని స్థానంలో మరో దాన్ని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మంచినీటిని అందించే మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్‌లో ఎలాంటి విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని, ఎప్పటికప్పుడు నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పరకాల ఏడీఈ దేవేందర్, ఏఈ గుర్రం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా చేశాం..

నయీంనగర్ : ఆస్పత్రులు, మిషన్ భగీరథ, నేత, చేనేత పరిశ్రమలు, ఇతర అత్యవసర సేవలకు సంబంధించిన సర్వీస్‌లకు ఈ వేసవిలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందించామని టీజీఎన్పీడీసీఎల్ హనుమకొండ సూపరింటెండెంట్ ఇంజినీర్ మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో ముఖ్యమైన సర్వీస్‌కు డీఈ, ఏడీఈ స్థాయి అధికారులను నోడల్ అధికారిగా నియమించి నిత్యం తనిఖీ చేసి ఎలాంటి సమస్యలు రాకుండా చూశామని తెలిపారు. ప్రధాన విద్యుత్ సరఫరా స్తంభిస్తే ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ ద్వారా సరఫరా కొనసాగించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కేడీసీలో ఉచిత కెమిస్ట్రీ శిక్షణ కార్యక్రమం

నయీంనగర్, మే 31 : హనుమకొండలోని కేడీసీ కళాశాలలో కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 40రోజుల రాష్ట్ర స్థాయి ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఆన్‌లైన్ ఉచిత శిక్షణలో భాగంగా శనివారం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యక్షతన మోటివేషనల్ అండ్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు రాజేంద్రసింగ్, బాల భాస్కర్ హాజరై మాట్లాడారు. ఈ సంవత్సరం ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఎంట్రెన్స్ పరీక్ష కోసం ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కాలేజీల విద్యార్థులు 470కు పైగా రిజిస్టర్ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలి

- రైల్వే ట్రాక్ వైపు డ్రెయిన్‌ను త్వరగా పూర్తి చేయాలి
- మేయర్ గుండు సుధారాణి

రైల్వేగేట్ వద్ద అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీని పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మే 31 : వర్షాకాలం నేపథ్యంలో డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం నక్కల గుట్ట సర్కిల్ ఆవరణలోని డీఆర్ఎఫ్ కార్యాలయాన్ని సందర్శించి వర్షాకాలంలో వినియోగించే బోట్లను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి విధి నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. బల్దియా నిర్వహణలోని నర్సరీని పరిశీలించారు. వనమహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎస్ఈ శ్రీనివాస్, ఇన్‌చార్జీ సీపీ రవీందర్ రాడేకర్, ఈఈలు రవికుమార్, మాధవీలత, ఏసీపీ రజిత, డీఈ రాజ్‌కుమార్, టీపీఎస్ రోజారాణి పాల్గొన్నారు. అలాగే వరంగల్ రైల్వే ట్రాక్ పక్క నుంచి 12 మోరీలకు కలిసే డ్రెయిన్‌ను త్వరగా పూర్తి చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఆమె 28,29 డివిజన్లలోని పాతబీట్ బజార్, మేదరి బస్తీ వరకు ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండు డివిజన్ల పరిధిలోని ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. అంపూర్తిగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, ఏసీపీ శ్రీనివాస్, టీపీఎస్ శ్రీకాంత్, ఏఈ ముజామిల్ పాల్గొన్నారు.

విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

నయీంనగర్, మే 31 : బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ పథకం కింద జిల్లాకు 1వ తరగతిలో 87 సీట్లు, 5వ తరగతిలో 88 సీట్లు కేటాయించారని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులానికి చెందిన విద్యార్థులు ఈ నెల 2వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 16వ తేదీ వరకు సాయంత్రం 5గంటల్లోగా ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు. కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే సీటు ఇస్తామని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1,50,000, పట్టణ ప్రాంతాల్లో రూ. 2లక్షలకు మించొద్దని, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం ఉండాలన్నారు. 1వ తరగతి విద్యార్థులు 1.6.2019 నుంచి 31.5.2020 మధ్య, 5వ తరగతి విద్యార్థులు 4వ తరగతి బోనోఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలని, 1.6.2015 నుంచి 31.5.2016 మధ్య జన్మించి ఉండాలన్నారు. రేషన్ లేదా ఆధార్ కార్డు జిరాక్స్, మీ సేవ ద్వారా జారీ చేసిన కుల, ఆదాయ, నివాస్ ధ్రువీకరణ పత్రాలు, 3 పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలు, 4వ తరగతి మార్కుల జాబితా జిరాక్స్ కాపీలు (అన్ని జిరాక్స్‌లపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించాలి) ధరఖాస్తుతో పాటు సమర్పించాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు హసన్‌పర్తిలోని సహాయ సాంఘిక సాంక్షేమ అధికారి ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయంలో దరఖాస్తు ఫాం పొందాలని, మరిన్ని వివరాలకు 9948866067, 7989135198, 9440615123, 7989725502 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

టీజేఎఫ్ రజతోత్సవ సభకు తరలిన జర్నలిస్టులు

వరంగల్, మే 31 : తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ సభకు తూర్పు జర్నలిస్టులు భారీగా తరలివెళ్లారు. శనివారం హైదరాబాద్‌లోని జల విహార్‌లో నిర్వహించిన సభకు టీయూడబ్ల్యూజే-143 జిల్లా అధ్యక్షుడు కోరుకొప్పుల నరేందర్ నేతృత్వంలో ఎంజీఎం దవాఖాన సెంటర్ నుంచి జర్నలిస్టులు హైదరాబాద్‌కు వాహనాల్లో వెళ్లారు. యూనియన్ కోశాధికారి రాపల్లి ఉపేందర్, నవనీత్, నీలం శివ, జర్నలిస్టులు బండి రవి, బజ్జూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల సంరక్షణే ప్రధాన లక్ష్యం

ఏసీపీ సతీశ్‌బాబు

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పరకాల, మే 31 : ప్రజల భద్రతల సంరక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఏసీపీ సతీశ్‌బాబు అన్నారు. శనివారం స్థానిక పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సంయుక్తంగా పరకాల పట్టణంలోని పాత సీఎంఎస్ గోడౌన్స్ నుంచి అంబేద్కర్ విగ్రహం మీదుగా హుజూరాబాద్ రోడ్డులోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పహల్గాం ఘటన ద్వారా దేశ ప్రజల్లో అలజడి రేగినప్పటికీ ఆపరేషన్ సిందూర్ ద్వారా విజయం సాధించి ఆత్మవిశ్వాసం చాటారన్నారు. దేశం, రాష్ట్రంతో పాటు వరంగల్ కమిషనరేట్ పరిధిలో సైతం ఎలాంటి క్రైమ్ కంట్రోల్ పరిస్థితులు ఏర్పడినా ఎదుర్కోడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రజలు ఎవరైనా అపరిచితులను గమనిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏఆర్ఎఫ్ అధికారి సరస్వతి, పరకాల, శాయంపేట, ఆత్మకూరు సీఐలు క్రాంతికుమార్, రంజిత్‌రావు, సంతోష్ పాల్గొన్నారు.

వడ్డేపల్లి చెరువు కట్ట వద్ద మృతదేహం గుర్తింపు

నయీంనగర్, మే 31 : వడ్డేపల్లి చెరువు కట్ట వద్ద మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువులో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించామన్నారు. ఆచూకీ తెలిసిన వారు కాజీపేట పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

పాగ తాగడం ఆరోగ్యం, పర్యావరణానికి హానికరం

వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

మాట్లాడుతున్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మల గీతాంబ

నయీంనగర్, మే 31 : పొగ తాగడం వల్ల ప్రజల ఆరోగ్యం ప్రభావితం కావడమే కాకుండా పర్యావరణానికి హాని కలిగిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ అన్నారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థలు సంయుక్తంగా న్యాయ సేవా సదన్ బిల్డింగ్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలా గీతాంబ హాజరై మాట్లాడుతూ.. పొగాకు వినియోగదారుల్లో అవగాహన కల్పించడం, మానేసేందుకు సలహాలు ఇవ్వాలన్నారు. పొగాకు వాడాలనే కోరికను అధిగమించడానికి వ్యాయామం, ఒత్తిడిని తగ్గించడానికి యోగ, సంగీతం వంటి ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి అపర్ణాదేవి, వరంగల్ జిల్లా బార్ అధ్యక్షుడు వలుస సుధీర్, న్యాయసేవా సంస్థ కార్యదర్శులు సాయి కుమార్, క్షమాదేశ్ పాండే పాల్గొన్నారు.

భీమదేవరపల్లి : మండలంలోని వంగర ప్రభుత్వాస్పత్రిలో శనివారం ప్రపంచ ధూమపాన నిషేధ దినోత్సవం ఘనంగా జరిగింది. ధూమపానం వల్ల కలిగే అనర్థాలను ప్రభుత్వ వైద్యాధికారిణి రుబీనా వివరించారు. ముఖ్యంగా ధూమపానం వల్ల క్యాన్సర్, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు సంక్రమిస్తాయని తెలిపారు. అనంతరం గ్రామాల్లో ధూమపానం నిషేధించాలని ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు రహమాన్, రాజశేఖర్, సిబ్బంది వాణి, స్వరూప, వంగర ఎస్సై దివ్య, ఏఎస్సై సంపత్ పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలో ప్రపంచ పోగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేంద్రన్ మాట్లాడుతూ పోగాకు వినియోగించడం వల్ల ఆరోగ్యపరీత్యా అనేక సమస్యలు వస్తాయన్నారు. ఊపిరితిత్తులు పాడవడం, క్యాన్సర్ వంటి రోగాలతో ప్రాణాలు కోల్పోతారని, యువత సిగరేట్, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలి : ఎమ్మెల్యే

దామెర, మే 31 : మండలంలోని ల్యాదెళ్లలో గల ఎస్సారెస్పీ భవనాల్లో మహిళా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు జరుగుతున్న మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం శిక్షణ కేంద్రంలో జరుగుతున్న మరమ్మతులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ల్యాదెళ్లలో మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ఏర్పాటు చేసే శిక్షణ కేంద్రం వల్ల ఆత్మకూరు, నడికూడ, దామెర, పరకాల రూరల్, పరకాలటౌన్‌లో ఉండే మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ఎగుమతి చేస్తామన్నారు. త్వరలో దామెరలో డెయిరీని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు బిల్లా రమణారెడ్డి, మండలాధ్యక్షులు మన్నెం ప్రకాశ